
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 17 జనవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	220	240
సూర్యాపేట	రూ.130	192	221
నల్లగొండ	రూ.132	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 19.6



నల్లగొండలోని వీటీ కాలనీలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

- ఉత్సాహంగా సంక్రాంతి, కనుమ వేడుకలు
- జిల్లా అంతటా పతంగుల ఎగురవేత, డీజేలతో నృత్యాలు
- కనుమనాడు పొలం పనులు ప్రారంభం



నల్లగొండ రామాలయంలో స్వామిసేవ...

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

నల్లగొండ కల్చరల్, జనవరి 16: మకర సంక్రాంతి, కనుమ వేడుకలను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. జిల్లా కేంద్రం నల్లగొండ పట్టణంతోపాటు జిల్లా అంతటా రెండు రోజుల పాటు పతంగులను ఎగురవేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నోములు ఆచరించారు. వాకిళ్ల రంగుల హరివిల్లును తలపించాయి. భవనాలపై యువకులు గుంపులుగుంపులుగా పతంగులు ఎగరవేస్తూ సందడి చేశారు. డీజేలతో హోరెత్తిస్తూ నృత్యాలు చేశారు. కనుమ రోజున రైతులు పశువులకు పూజలు చేసి పొలం పనులు ప్రారంభించారు. విద్యుత్ వైర్లకు చిక్కిన పతంగులు, మాంజాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భక్తులతో ఆలయాలు రద్దీగా మారాయి. రామగిరిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని అర్చనలు చేశారు. అదే విధంగా తులసీనగర్‌లోని భక్తాంజనేయస్వామి దేవాలయం, శేర్‌బంగ్లాలోని సంతోషిమాత ఆలయం, ఆనంద్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, వీటీ కాలనీలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, బీట్ మార్కెట్‌లోని శ్రీరామకోటి స్థూప దేవాలయం, పానగల్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి, పచ్చలఛాయా సోమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు తదితరులు ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు.

ముగిసిన ధనుర్మాసోత్సవాలు

జిల్లాకేంద్రంలోని పలు వైష్ణవాలయాల్లో 30రోజులపాటు నిర్వహించిన ధనుర్మాస వ్రత మహోత్సవాలు ముగిశాయి. రామగిరిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో, తమిళనాడులోని శ్రీరంగనాథ దేవస్థానం ప్రధానాచార్యులు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణచార్య ఆధ్వర్యంలో 30 రోజులపాటు ఆండాళ్ అమ్మవారు రచించిన తిరుప్పావై పాశురాలను ప్రవచనంచేశారు. ప్రతీ రోజు అమ్మవారి వ్రత విశేషాలను భక్తులకు వివరించారు. విశేష పర్వదినాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా జరిగాయి. శ్రీగోదా రంగమన్నార్ల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సోమవారం సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆలయంలోని అమ్మవారికి ఒడిబియ్యం, గోదా రంగనాథుల పవళింపు సేవా కార్యక్రమాలను సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. దీంతో ధనుర్మాస ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణచార్యను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఈవో జయరామయ్య, అర్చక స్వాములు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై నిశ్శబ్దం

చిట్యాలరూరల్: నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే జాతీయ రహదారికి సంక్రాంతి పండుగ విశ్రాంతినిచ్చినట్లు కనిపించింది. సంక్రాంతి పండుగకు రెండు రోజుల ముందుగానే ప్రజలకు సొంతూళ్లకు వెళ్లారు. దీంతో సంక్రాంతి రోజున ఈ నెల 15న జాతీయ రహదారిపై వాహనాలు లేక బోసిపోయింది. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు తగ్గుముఖం పట్టడంతో వాహనాల సంచారం లేక నిశ్శబ్దంగా మారింది.



చిట్యాల మండలం వట్టిమర్తి శివారులో వాహనాలు లేక నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

పండుగ పూట విషాదాలు

- ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి
- ఒకరి హత్య

పండుగ రోజు ఉమ్మడి జిల్లాలో పలు విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాతపడ్డారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో ఒకే గ్రామానికి చెందిన స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వేములపల్లి మండలంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలో ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో మరొకరు మృతి చెందారు. మోత్కూరులో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో దొంగలు హల్‌చల్ చేశారు. ఓ దుకాణంలో రూ.2.20 లక్షలను చోరీ చేశారు. తిప్పర్తి పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో గాయపడి రెండు నెలలుగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మిర్యాలగూడ మండలంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇంట్లోని రూ.5 లక్షలు, 7 తులాల బంగారం దగ్ధమైంది. ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న పలు సంఘటనలు పండుగపూట విషాదం నింపాయి.



చింతపల్లి మండలంలో జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న కారు

7

లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లు

- గుర్తించే పనిలో అధికారుల నిమగ్నం
- మార్పులు, చేర్పులకు కసరత్తు



7

ఆర్టీసీకి కాసుల పంట

రెండు రోజుల ఆదాయం రూ.2.70కోట్లు
సంస్థకు కలిసొచ్చిన పండుగ





నల్లగొండ, జనవరి 16: సంక్రాంతి పండుగకు ఆర్టీసీ నల్లగొండ రీజియన్‌కు కాసుల వర్షం కురిసింది. మహాలక్ష్మి పథకం ఉన్నప్పటికీ పురుషుల ప్రయాణం అధికంగా ఉండటంతో ఆర్టీసీకి ఆదాయం సమకూరింది. ఈ నెల 13, 14 తేదీల్లో రెండు రోజులపాటు ప్రయాణికులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించడంతో రూ.2.70 కోట్ల ఆదాయం సమకూరింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో ఆర్టీసీకి ఆదాయం పెరిగి, సంస్థకు ప్రయోజనం చేకూరింది. ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించినప్పటికీ ఇంకోవైపు ఆర్టీసీకి మాత్రం ఆదాయం మాత్రం తగ్గలేదు. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ఆర్టీసీకి ఇదే మొదటిసారి వచ్చిన అధిక ఆదాయమని తెలుస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవులు ఉండటంతో అధిక సంఖ్యలో ప్రయాణించారు. 2023లో జనవరి 13న మొత్తం 1,94,990 మంది ప్రయాణించగా సంస్థకు రూ.1,35,52,000 ఆదాయం వచ్చింది. అదే ఈ ఏడాది జనవరి 13న మొత్తం 2,64,772 మంది ప్రయాణించారు. దీంతో మహాలక్ష్మి పథకంతో(జీరో టికెట్) సంబంధం లేకుండా రూ.87,23,000 సంస్థకు వచ్చాయి. జీరో టికెట్‌లతో కలిసి సంస్థకు (ప్రభుత్వం నుంచి రీయింబర్సుమెంట్) రూ.1.57కోట్లు సమకూరాయి. 13న మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు 1,13,133 మంది ఉచితంగా ప్రయాణించారు. 2023 జనవరి 14న నల్లగొండ రీజియన్‌లో 1,52,338 మంది ప్రయాణించగా సంస్థకు రూ.1.07కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది జనవరి 14న రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో 2,06,847మంది ప్రయాణం చేయగా సంస్థకు మహాలక్ష్మి పథకంతో సంబంధం లేకుండా రూ.70లక్షల ఆదాయం వచ్చింది. మహాలక్ష్మి పథకంతో కలిసి సంస్థకు రూ.1.22కోట్లు వచ్చాయి. 14న 93,792మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు.



రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించే యోచనలో లేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలు ఇప్పటికే అమలుచేయగా, మిగతా గ్యారంటీ పథకాలను అమలు చేయాలని చూస్తోంది. ఫలితంగా లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 31తో పంచాయతీల పాలకవర్గ గడువు ముగుస్తుంది. దీంతో ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆలోచనలో లేదు. అయితే గ్రామపంచాయతీల్లో ప్రత్యేక పాలన దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

\- నల్లగొండ

పంచాయతీల్లో ప్రత్యేక పాలన దిశగా..

- స్పెషల్ ఆఫీసర్లా? పర్సన్ ఇన్‌చార్జ్‌లా?
- ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే
- గత బీసీ రిజర్వేషన్లపై నివేదిక కోరిన ప్రభుత్వం
- పాత రిజర్వేషన్లా, కొత్త రిజర్వేషన్లతో ఎన్నికలా

గత నెలలో ప్రభుత్వం పంచాయతీ అధికారుల నుంచి ఎన్నికలకు కావాల్సిన సిబ్బంది నివేదికను కోరింది. అయితే ఆ తర్వాత ఎలాంటి ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగలేదు. ఎన్నికలు నిర్వహించాలంటే జనవరి మొదటి వారంలోనే నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది. పంచాయతీ పాలకవర్గం గడువు కేవలం 16 రోజులు మాత్రమే ఉండటంతో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు స్పష్టత లేదనేది అర్థమవుతోంది. దీంతో స్పెషల్ ఆఫీసర్ల పాలన, లేదంటే పర్సన్(ప్రస్తుత సర్పంచ్) ఇన్‌చార్జీలకు బాధ్యతలు ఇస్తారో వేచి చూడాల్సి ఉంది. పాలకవర్గం గడువు ముగిసే రెండు, మూడు రోజులకు ముందు అంటే ఈ నెలాఖరున రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. స్పెషల్ ఆఫీసర్ల పాలన అయితే ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యదర్శి కార్యనిర్వహణ అధికారిగా ఉండనుండగా, కార్యదర్శికి తోడుగా ప్రత్యేకాధికారిని నియమిస్తారు. మండల పరిషత్ పరిధిలోని సూపరింటెండెంట్, ఎంపీవో, ఏఈలు, వ్యవసాయ అధికారులు, పశువైద్యాధికారులు నియమితులైనట్లయితే పాలన మొత్తం వారి పరిధిలో ఉండనుంది.

ఎలాంటి ఆదేశాలు రాలేదు



పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. గతంలో అధికారులు ఎన్నికల నిర్వహణకోసం సిబ్బంది వివరాలతో పాటు బీసీ రిజర్వేషన్లపై వివరాలు కోరడంతో 2006, 2013, 2018 ఎన్నికల్లో ఉన్న బీసీ రిజర్వేషన్లపై నివేదిక పంపాం. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించే విషయంతోపాటు ఒకవేళ ఇప్పుడు ఎన్నికలు నిర్వహించకపోతే స్పెషల్ ఆఫీసర్లా ?, పర్సన్ ఇన్‌చార్జీలా ? అనేది ప్రభుత్వ ఆదేశానుసారంగా నిర్ణయం తీసుకుంటాం.

\- విష్ణువర్ధన్‌రెడ్డి, డీపీవో నల్లగొండ

ఉమ్మడి జిల్లాలో 1,740 గ్రామ పంచాయతీలు

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 1,740 గ్రామపంచాయతీలున్నాయి. నల్లగొండ జిల్లాలో 844 గ్రామపంచాయతీలు, సూర్యాపేట జిల్లాలో 475, యాదాద్రి భువనగిరి జిల్లాలో 421 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు వాయిదా వేస్తే జూన్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు రెండు పర్యాయాల వరకు అప్పటి రిజర్వేషన్లు ఉంచినట్లయితే జూన్‌లో ఎన్నికలు సాధ్యమవుతాయి. ప్రభుత్వం రిజర్వేషన్లు ఒక పర్యాయానికే పరిమితం చేయాలని భావించినట్లయితే చట్ట సవరణ చేయాల్సి ఉంటుంది. దీనికి శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేసి చట్ట సవరణ చేయాల్సి ఉంది. ఇంకా ఇదే సంవత్సరంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలు కూడా రానున్నాయి. ఈ ఏడాది మొత్తం ఎన్నికలు నిర్వహించనున్నారు. గతంలో గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు దఫాలుగా నిర్వహించారు. ఈసారి కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు దఫాలల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

గత బీసీ రిజర్వేషన్ల వివరాలు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు వివరాలను సేకరించినట్లు సమాచారం. దీంతో రాష్ట్రస్థాయి అధికారులు 2006, 2013, 2018 సంవత్సరాల్లో గ్రామపంచాయతీల్లో అమలు చేసిన బీసీ రిజర్వేషన్ల వివరాలను తీసుకున్నారు. అప్పట్లో గ్రామపంచాయతీల్లో వార్డులు, సర్పంచ్‌లకు అమలైన బీసీ రిజర్వేషన్లను తీసుకున్నారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణ లేకపోవడంతో పూర్తిస్థాయిలో కొత్తగా రిజర్వేషన్లు అమలుచేసి ఎన్నికలు నిర్వహిస్తారా? లేదా? పాత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు ఉంటాయా? అనేది మరికొన్ని రోజుల్లో తేలనుంది. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ పార్టీలు డైలమాలో ఉన్నారు. సర్పంచ్ పదవులకు పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న నాయకులు కొత్త ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియకపోవడంతోపాటు రిజర్వేషన్లు పాతవే కొనసాగిస్తారా?, కొత్త రిజర్వేషన్లు చేసి ఎన్నికలు నిర్వహిస్తారని తేలకపోవడంతో నేతలు అయోమయంలో పడ్డారు.

డిండి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలి

- కలెక్టర్ హరిచందన దాసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ టౌన్, జనవరి 16: జిల్లాలో డిండి ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన రిజర్వాయర్ భూసేకరణ, పునరావాస కేంద్రాల పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో కలిసి రెవెన్యూ, భూసేకరణ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పథకంలో భాగంగా చేపట్టిన సింగరాజుపల్లి, చింతపల్లి, డిండి మెయిన్ కెనాల్, కిష్టరాయిన్‌పల్లి, శివన్నగూడెం, గొట్టిముక్కల రిజర్వాయర్ల భూసేకరణ, పునరావాస కేంద్రాల ఏర్పాటు పనుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎమ్మార్పీలో భాగంగా చేపట్టిన పెండ్లిపాకల, ఉదయ సముద్రం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు భూసేకరణ, పునరావాస పనులపై, అంబాభవాని, అయిటి పాముల, కాళేశ్వరం పథకం పనుల ప్రగతిపై సుదీర్ఘంగా చర్చించారు. డిండి ఎత్తి పోతల పథకం సంబంధించి నిర్వాసితులకు పునరావాస కల్పనకు నోటిఫికేషన్ జారీ చేయాలని దేవరకొండ ఆర్డీవోను ఆదేశించారు. ఉదయ సముద్రం మార్కింగ్ పనులు వేగవంతం చేయాలని, సర్వే ల్యాండ్ రికార్డ్సు ఏడీని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు రవి, దామోదర్‌రావు, శ్రీరాములు, ఇరిగేషన్ ఈఈలు యాదన్‌కుమార్, రాములు, యలమందయ్య, శ్రీధర్ రావు, వైటీపీసీ ఈఈ బుచ్చయ్య, ఎస్‌డీసీ యూనిట్-1 అధికారి లీల, సూపరింటెండెంట్లు హేమలత, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైకల్య నిర్ధారణ పరీక్షల్లో నల్లగొండ ప్రథమస్థానం

రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ విజయలక్ష్మి



ఆసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న విజయలక్ష్మి

నల్లగొండ, జనవరి 16: వైకల్య నిర్ధారణ పరీక్షల్లో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోని ప్రథమస్థానంలో ఉందని సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని సందర్శించి సదరం వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 84,113 మందికి వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ముందు ఇదే విధంగా కొనసాగించాలన్నారు. సదరం క్యాంపునకు అమెరికా నుంచి వచ్చిన ప్రొఫెసర్ నందవదన జిల్లా అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని, అదనపు పీడీ సరస్వతి, డీపీఎం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి పర్యటన



నల్లగొండటౌన్, జనవరి 16: రోడ్లు, భవనాలు శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం నల్లగొండలో పర్యటించనున్నారు. మొదటగా పట్టణంలో రెండు మునిసిపల్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో జరిగే కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని జిల్లాలో ప్రస్తుతం నడుస్తున్న అభివృద్ధి పనులు, వాటి స్థితిగతులపై కలెక్టర్‌తో రివ్యూ మీటింగ్ నిర్వహించనున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ పనులకు భూమి పూజ చేస్తారు.


మోసం చేస్తే కఠిన చర్యలు

లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులు



తనిఖీలు నిర్వహిస్తున్న లీగల్‌మెట్రాలజీ అధికారులు

నల్లగొండ టౌన్, జనవరి 16: తూనికలు, కొలతల్లో మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులు అన్నారు. వ్యాపారులు వినియోగించే తూకపురాళ్ళు, యంత్రాల్లో జరిగే మోసాలపై మంగళవారం జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక బీట్ మార్కెట్లోని కూరగాయల బజార్లో వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వినియోగదారులకు తూకాల్లో మోసాలు జరిగినట్లు అనుమానం వస్తే, వెంటనే వ్యాపారులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. తూనికల్లో జరిగే మోసాలపై విధిగా లీగల్ మెట్రాలజీ శాఖ కార్యాలయంలో గాని, సెల్:9440575081, 9010651783లను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా వ్యాపారులు తూకపురాళ్లను వినియోగించినా లీగల్ మెట్రాలజీ యాక్ట్ ప్రకారం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లోతనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ రోడ్డు, దేవరకొండ రోడ్‌లలో గల చికెన్, మటన్, చేపల విక్రయదారుల దుకాణాలపై దాడులు చేసి, తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో జలీల్ ఖాన్, సైదులునాయక్, డి.సైదులు తదితరులు పాల్గొన్నారు.







'ఫణిగిరి' క్షేత్రానికి
అంతర్జాతీయ గుర్తింపునకు కృషి



ఫణిగిరిలోని మ్యూజియంలోని వస్తువులను పరిశీలిస్తున్న భారతిహోళికేరి

నాగారం, జనవరి 16: ఫణిగిరి బౌద్ధక్షేత్రానికి అంతర్జాతీయ గుర్తింపునకు కృషి చేస్తామని రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ భారతిహోళికేరి అన్నారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి గట్టుపై క్రీస్తుశకం 3వ శతాబ్దంలో నిర్మించిన బౌద్ధక్షేత్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఫణిగిరిలో లభించిన 1వ శతాబ్దం నుంచి 3వ శతాబ్దం కాలం నాటి బౌద్ధక్షేత్ర ఆధారాలైన బౌద్ధారామం, చైత్యాలు, శిల్పసంపదను ఫణిగిరి మ్యూజియంలో భద్రపరిచిన వాటిని పరిశీలించారు. ఫణిగిరి గట్టుపైన కట్టడాలను, పురావస్తు శాఖ తవ్వకాల వివరాలను తెలుసుకున్నారు. శిల్ప సంపదను గుర్తించేందుకు మరోసారి తవ్వకాలు జరిపేందుకు సిబ్బందితో కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఢిల్లీలోని కేంద్ర పురావస్తు శాఖ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపుతామని, అనుమతి రాగానే తవ్వకాలు ప్రారంభిస్తామన్నారు. ఫణిగిరిలో తాత్కాలికంగా నిర్మించిన మ్యూజియంలో ఏర్పాటు చేసిన బౌద్ధ శిల్పాలను భద్రపర్చేందుకు, విశాలమైన మ్యూజియం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. అంతర్జాతీయ బౌద్ధ బిక్షువులు ఫణిగిరి క్షేత్రాన్ని సందర్శించేందుకు మెరుగైన వసతులు కల్పించేలా గృహాలు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆమె వెంట పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్లు రాములునాయక్, నాగరాజు, అసిస్టెంట్ డైరక్టర్లు మల్లునాయక్, సాగర్, బోధిసత్వం ఫౌండేషన్ అధ్యక్షుడు పులిగిళ్ల వీరమల్లుయాదవ్, జంపాల రాజేష్, నరహరి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఫణిగిరి గట్టును అభివృద్ధి చేయడంతో పాటు తవ్వకాలు చేపట్టాలని కోరుతూ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు పురావస్తు శాఖ డైరెక్టర్ భారతిహోళికేరిని కలిసి బోధిసత్వ ఫౌండేషన్ అధ్యక్షుడు వీరమల్లుయాదవ్ ఈ నెల 11వ తేదీన వినతిపత్రం అందజేశారు.

బతుకుదెరువుకు
భార్యాభర్తల చోరీల బాట

● బోరు మోటార్లు చోరీ చేస్తున్న జంట అరెస్టు ● నల్లగొండ జిల్లా డిండి మండలంలో ఘటన ● నాగర్‌కర్నూలు జిల్లా వాసులుగా గుర్తింపు

డిండి, జనవరి 16: బతుకుదెరువుకు రాజధానికి వచ్చిన భార్యాభర్తలు చోరీల బాట పట్టారు. నాలుగు నెలల క్రితం చోరీ చేసిన దుకాణంలో మరోసారి దొంగతనం చేసి ఆటోలో వెళుతూ పోలీసులకు చిక్కారు. మంగళవారం నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మీరజోట్ నర్సింహ అతడి భార్య కమల బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వలస వచ్చి సింగరేణి కాలనీలో నివాసం ఉంటున్నారు. నర్సింహ ఆటోడ్రైవర్‌గా, కమల కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తుండగా, మూడేళ్ల కుమార్తె ఉంది. మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో డిండి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అదే సమయంలో ఓ ఆటో(టీఎస్05యూఈ 6816) శ్రీశైలం వైపు నుంచి హైదరాబాద్‌కు వెళుతోంది. వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులు ఆటోను ఆపే ప్రయత్నం చేయగా డ్రైవర్ నర్సింహ తప్పించుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వెంబడించి పట్టుకోగా, ఆటోలో ఐదు బోరు మోటర్లు, వాటి విడిభాగాలకు సంబంధించిన వస్తువులను గుర్తించారు. ఇవి ఎక్కడివని ప్రశ్నించగా తాము భార్యాభర్తలమని, డిండి మండల కేంద్రంలోని వేంకటేశ్వర మెకానిక్ దుకాణం నుంచి అపహరించి విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్నట్లు అంగీకరించారు. మరమ్మతుల నిమిత్తం తీసుకువచ్చే బోరు మోటార్లు డిండిలోని దుకాణం బయటే ఉంచుతారని గమనించిన భార్యాభర్తలు వాటిని ఆటోలో తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటారని అంగీకరించారు. గతంలో చోరీ చేసిన దుకాణం ఎదుటే ఉంచిన బోరు మోటార్లను ఆటోలో తీసుకువెళుతూ ఈసారి పోలీసులకు చిక్కారు. నర్సింహ భార్య కమల ప్రస్తుతం గర్భిణి. ఈ కేసులో నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

పండగ పూట విషాదాలు

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. నలుగురు గాయపడ్డారు. నల్లగొండ జిల్లాలో ముగ్గురు, యాదాద్రిభువనగిరి జిల్లాలో ఒకరు చొప్పున మృత్యువాత పడ్డారు.



రాఘవేందర్, అరవింద్(ఫైల్‌ఫొటోలు)

చింతపల్లి, జనవరి 16: సంక్రాంతి పండుగ వేళ కుర్మపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో కారు అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నాంపల్లి సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతపల్లి మండలం కుర్మపల్లి గ్రామానికి చెందిన దార్ల ప్రభాకర్, పోలోజు రాఘవేందర్(29), దార్ల అరవింద్(22)లు ఇత్తడి వస్తువులపై నక్ష వేసే వృత్తి చేస్తూ జీవనం సాగిస్తుండగా, ఎవరికీ వివాహం కాలేదు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వీరి కుటుంబాలు సైతం ఇదే వృత్తి నిర్వహణలో ఉన్నాయి. ఈ నెల 14వ తేదీ సాయంత్రం ఈ ముగ్గురూ కలిసి పని నిమిత్తం హైదరాబాద్‌లోని బేగంబజార్‌కు వెళ్లి అదే రోజు రాత్రి స్వగ్రామానికి బయలుదేరారు. ప్రభాకర్ కారు నడుపుతుండగా చింతపల్లి మండలం పోలేపల్లి రాంగనర్ సమీపంలో మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి నాలుగు పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి రోడ్డు పక్కన స్తంభానికి తగిలి నిలిచింది. ఈ ఘటనలో పోలోజు రాఘవేందర్(29), దార్ల అరవింద్(22) అక్కడికక్కడే మృతి చెందగా ప్రభాకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న ప్రయాణికులు డయల్-100కు సమాచారం అందించారు. దీంతో చింతపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రగాయాలైన ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అరవింద్ పెద్దనాన్న బ్రహ్మచారి ఫిర్యాదు మేరకు మృతదేహాలకు దేవరకొండ సివిల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.యువకుల మృతదేహాలకు సోమవారం అంత్యక్రియలు పూర్తి చేశారు.సంక్రాంతి పండుగ రోజున గ్రామానికి చెందిన యువకులు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్ అదుపుతప్పి యువకుడు...

వేములపల్లి: నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో బైక్ అదుపు తప్పిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఏఎస్ఐ నరసింహారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడడు మండలం కల్వలపల్లి గ్రామానికి చెందిన వంటెపాక స్వామి(25) ప్లంబర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారి పనినిమిత్తం సోమవారం ఉదయం బైక్‌పై మిర్యాలగూడకు వచ్చి పనిముగించుకుని సాయంత్రం స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని శెట్టిపాలెం గ్రామశివారులోని మహేశ్వరి మిల్లు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి రైస్‌మిల్లు గోడకు ఢీకొట్టింది. ఈ ఘటనలో స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామి తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..



మహేష్(ఫైల్)

ఆలేరు రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలో రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. ఎస్ఐ వెంకటశ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూరు గ్రామానికి చెందిన సీస మహేష్(35) తన బైక్‌పై గొలనుకొండలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో జనగాం జిల్లా లింగాలఘనపురం మండల కుందారం గ్రామానికి చెందిన ఎల్లల నరేష్ తన బైక్‌పై ఎదురుగా వస్తూ కుమ్మరికుంట వద్ద మహేష్ బైక్‌ను ఢీకొనడంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. నరేష్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆలేరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహేష్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మహేష్‌కు భార్య భవానీతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

సీసీ కెమెరాలు ధ్వంసం చేసి.. దుకాణంలోకి చొరబడి



దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తుంగతుర్తి: సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో సోమవారం అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. సీసీ కెమెరాలు ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని వెంపటి రోడ్డులోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి దుకాణం ముందున్న రెండు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి దొంగలు, షెట్టర్‌ను ఎత్తి దుకాణంలోని రూ.2.20 లక్షల నగదును చోరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మంగళవారం ఉదయం రోజు మాదిరిగానే దుకాణ యజమాని నిమ్మల వేణు షాపు తెరిచేందుకు వెళ్లగా షెట్టర్ తెరిచి ఉండడంతో అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా అదే దారిలో ఉన్న ఇస్లావత్ విజయ్ దాబా ముందు వేణు బైక్‌ను కూడా చోరీచేశారని తెలిపారు. వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అతివేగం.. రాంగ్ రూట్లో

కనగల్: అతివేగంతో రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు బస్సును ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో జరిగింది. ఎస్ఐ రామకృష్ణాగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ మండలం (కనగల్ పోలీస్ స్టేషన్‌పరిధిలోని) జీచెన్నారం గ్రామస్టేజీవద్ద నల్లగొండ-దేవరకొండ ప్రధానరహదారిపై మంగళవారం సాయంత్రం దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగంగా పూర్తిగా దెబ్బతిన్నది. బస్సులో ప్రయాణిస్తున్న శ్యామలత అనే ప్రయాణికురాలితో పాటు కారులో ప్రయాణిస్తున్న జీ చెన్నారం గ్రామానికి చెందిన కాలం నవీన్, ఉప్పునూతల ఉదయ్‌కుమార్, ఉప్పునూతుల కోటేష్‌లు సైతం గాయపడ్డారు. సంఘటనా స్థలానికి సీఐ వెంకటయ్య, ఎస్ఐ రామకృష్ణాగౌడ్‌లు సిబ్బందితో చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులోని ముగ్గురు దర్వేశిపురంలో జరిగిన శుభకార్యానికి హాజరై స్వగ్రామనికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని ఎస్ఐ తెలిపారు. నవీన్ అతివేగంతో కారును రాంగ్‌రూట్‌లో నడపటమే ప్రమాదానికి కారణమని తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు, కారు

మోత్కూరులో వృద్ధుడి హత్య



ఖలీమొద్దీన్(ఫైల్)

మోత్కూరు, జనవరి 16 : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంలో వృద్ధుడు సోమవారం మధ్యాహ్నం హత్యకు గురయ్యాడు. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ మోతీరాం వెల్లడించారు. మోత్కూరు పట్టణంలో ఎండీ ఖలీమొద్దీన్(70) 25 ఏళ్లుగా పాత ఇనుపసామన్లు, ప్లాస్టిక్ వస్తువులను కొనుగోలు చేసే వ్యాపారం చేస్తున్నాడు. అతడిని సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో తల వెనుక భాగాన కొట్టి హత్య చేశారు. మంగళవారం ఉదయం దుకాణంలో పనిచేసే వారు వచ్చి చూసేసరికి ఖలీమొద్దీన్ మృతి చెంది ఉన్నాడన్నారు. పోలీసుల జాగిలాన్ని(కుక్క) రప్పించి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. ఖాలీముద్దీన్‌కు భార్య, పిల్లలు లేకపోవడంతో ఒంటరిగానే జీవిస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ హెడ్‌కానిస్టేబుల్ మృతి



ఖలీమొద్దీన్(ఫైల్)

తిప్పర్తి, జనవరి 16 : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న మహిళా హెడ్‌హెడ్‌కానిస్టేబుల్ మంగళవారం మృతి చెందింది. నల్లగొండ పట్టణానికి చెందిన కుర్ర భారతి(48) 1995లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ నల్లగొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని హ్యాపీ హోమ్స్‌లో నివాసముంటోంది. గతేడాది నవంబరు 1న తిప్పర్తిలో విధులు ముగించుకొని స్కూటీపై నల్లగొండకు బయలుదేరింది. మల్లెపల్లివారిగూడెం గ్రామం సమీపంలో స్కూటీ టైర్ పేలి బైకు అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో మొదట నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదం జరిగిన రోజు నుంచి కోమాలోనే ఉన్న భారతి మంగళవారం ఉదయం మృతి చెందింది. ఆమె భర్త భీమ్‌రావు కొన్నేళ్ల కిందట మృతి చెందగా వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న తిప్పర్తి పోలీసులు నల్లగొండలో భారతి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

మిర్యాలగూడ అర్బన్, జనవరి 16: సంక్రాంతి పండుగ రోజున నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం సామ్యతండాలో సోమవారం విషాదం చోటుచేసుకుంది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో నిమిషాల వ్యవధిలో గుడిసె దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంటి నిర్మాణంకోసం తెచ్చిన రూ.5 లక్షల నగదు, 7తులాల బంగారం దగ్ధమైంది. స్థానికులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన ధనావత్ హనుమానాయక్ కుటుంబసభ్యులంతా బంధువులతో కలిసి సంక్రాంతి వేడుకల్లో మునిగిపోయారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంట్లోని విద్యుత్ స్విచ్‌బోర్డులో షార్ట్‌సర్క్యూట్ జరిగి పొగవ్యాపించిన కొద్దిక్షణాల వ్యవధిలో ఏర్పడ్డ మంటలు పూరింటిని అంటుకున్నాయి. దీంతో మంటలు చెలరేగడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అయితే ఫిబ్రవరిలో కొత్తగా ఇంటి నిర్మాణం కోసం అప్పుగా తెచ్చి ఇంట్లో దాచుకున్న రూ.5లక్షల నగదు, 7 తులాల బంగారు ఆభరణాలు మంటల్లో దగ్ధకావడంతో బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బాధితకుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా కృషిచేస్తానన్నారు. హనుమానాయక్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత ఖాదర్‌వలీ

కోదాడ రూరల్, జనవరి 16 : చిరుధాన్యాల సాగుపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత ఖాదర్‌వలీ అన్నారు. మండలంలోని గుడిబండ గ్రామంలో స్వచ్ఛత ఆరోగ్యమే మహాభాగ్యం అనే సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా చిరుధాన్యాలు తీసుకుంటేనే మనిషి ఆరోగ్యకరంగా ఉంటాడన్నారు. ప్రజల ఆరోగ్యాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు సాగు చేసేందుకు చిరుధాన్యాల విత్తనాలను ఉచితంగా అందించాలని కోరారు. ఇర్ల శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్లు సూదిని ముత్యపురెడ్డి, మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత

నల్లగొండ టౌన్, జనవరి 16 : నల్లగొండ మెడికల్ కళాశాలకు మృతదేహాన్ని అప్పగించి ఓ కుటుంబం ఔనత్యాన్ని చాటుకుంది. వివరాల్లోకి వెళితే తిరుమలగిరి మండల కేంద్ర ప్రాంతానికి చెందిన చవ్వా రాంరెడ్డి(70) వృత్తీరీత్యా వ్యవసాయం చేసుకొని బతికేవాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్న రాంరెడ్డి మంగళవారం మృతి చెందారు. తన జీవితాంతం మట్టిని నమ్ముకొని బతికిన రాంరెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు జరపకుండా మరణానంతరం కూడా ప్రజలకు ఉపయోగపడాలన్న ఆలోచనతో మెడికల్ కళాశాలకు ఆయన మృతదేహాన్ని ఇచ్చేందుకు కుటుంబసభ్యులు సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం రాత్రి భార్య రాములమ్మ, కుమారుడు బుచ్చిరెడ్డి, కుమార్తె కవితలు మట్టిమనిషి వేనపల్లి పాండురంగారావు, బంధువులు ఇంద్రవెల్లి బుచ్చిబాబు, రమణ సమక్షంలో జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలకు మృతదేహాన్ని అప్పగించారు.

అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభ్యం



ఎడ్ల పాండు

పాలకవీడు, జనవరి 16 : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ లింగయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బొత్తలపాలెం గ్రామానికి చెందిన ఎడ్ల పాండు(56) ఎస్సీ కాలనీలోని రావి చెట్టు వద్ద ఉన్న మురికి కాల్వలో విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. స్థానికుల సహాయంతో సీఐ రామలింగారెడ్డి మృతదేహాన్ని తీయించి పరిశీలించించారు. మృతుడి తలపై తీవ్రమైన గాయాలున్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. పాండు భార్య శాంతమ్మ కొంతకాలం కిందట చనిపోయింది. కుమార్తె సప్పిటి స్వరూప, కుమారుడు ఎడ్ల పవన్‌లకు పెళ్లిళ్లు కావడంతో వారు నేరుడుచర్ల మండల కేంద్రంలో ఉంటున్నారు. కుమార్తె స్వరూప ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు ఎస్ఐ లింగయ్య తెలిపారు.

ద్విచక్రవాహనం దహనం

బైక్‌ను దగ్ధం చేసిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగయ్య తెలిపారు. మండలం సజ్జాపూరం గ్రామానికి చెందిన మూగల బాలసైదులు, మరో వ్యక్తితో కలిసి పాలకవీడు మండలకేంద్రం నుంచి సజ్జాపూరం గ్రామానికి టీఎస్29 హెచ్ 5000 నెంబరు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో గంగమ్మ గుడి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మద్యం మత్తులో బైక్‌ను ఆపి గొడవపడి బాలసైదులు బైక్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో బైక్ పూర్తిగా కాలిపోయింది. బాలసైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి



వసంతలక్ష్మి(ఫైల్)

చింతపల్లి, జనవరి 16 : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం ఎం.మల్లేపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ వైద్యుల వసంతలక్ష్మి(55) గుండెపోటుతో సోమవారం మృతి చెందింది. ఉదయం ఇంట్లో ఆకస్మాత్తుగా గుండెనొప్పితో కుప్పకూలిపోయారు. స్థానిక వైద్యులకు చూపించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. 20 ఏళ్లుగా ఎం.మల్లేపల్లి గ్రామ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. అంత్యక్రియల నిమిత్తం ఐసీడీఎస్ ద్వారా రూ.20వేల నగదును ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులకు అందజేశారు. దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ వసంతలక్ష్మి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు వంగాల ప్రతాప్‌రెడ్డి, ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ తదితరులు ఉన్నారు.

యాదగిరిక్షేత్రంలో వైభవంగా సంక్రాంతి వేడుకలు



అమ్మవారికి ఒడిబియ్యం నింపుతున్న మహిళలు

యాదగిరిగుట్ట, జనవరి 16: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో సంక్రాంతి వేడుకలు వైభవంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులకు నిజాభిషేకం నిత్యార్చన, ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం కల్యాణమూర్తులు గోదా శ్రీరంగనాథులను దివ్యమనోహరంగా అలంకరించి ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలోని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆండాళ్ అమ్మవారిని కొలుస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళా భక్తులు ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో చివరి రోజున గోదాదేవి, శ్రీరంగనాధుడిని పరిణయం మరుసటి రోజున ఒడి బియ్యం సమర్పణతో నెల రోజులుగా కొనసాగిన ధనుర్మాస ఉత్సవాలు పరిసమాప్తమైనట్టు ఆచార్యులు వివరించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా యాదగిరిక్షేత్రాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించి ఇష్ట దైవాలను దర్శించుకుని ఆర్జితసేవోత్సవాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.44,63,140 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

కొనసాగిన భక్తుల రద్దీ

యాదగిరిక్షేత్రంలో మంగళవారం క్షేత్రపాలకుడు ఆంజనేయుడికి ఆకుపూజ,స్వామికి నిత్యవిధి కైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో ఘనంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి, పాతగుట్ట ఆలయంలోని, పుష్కరిణి, శివాలయంలో కొలువుదీరిన ఆంజనేయస్వామిని కొలుస్తూ పంచామృతాలతో అభిషేకించి నాగవల్లీదళాలతో అర్చించారు. ముందుగా ప్రధానాలయంలో కొలువైన మూలమూర్తులను అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి గజవాహన సేవ,నిత్యకల్యాణం నిర్వహించారు. ముందుగా సుదర్శన నారసింహ హోమం కొనసాగింది. వరుస సెలవులు రావడంతో భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శించారు. ఐనవోలు, కొమరవెల్లి, సమ్మక్క, సారలమ్మ క్షేత్రాలను సందర్శించిన భక్తులు తిరుగు ప్రయాణంలో యాదగిరిక్షేత్రాన్ని దర్శించుకోవడంతో గుట్ట తిరువీధులు భక్తులు సంచారంతో రద్దీగా కనిపించాయి. సోమ,మంగళవారాల్లో యాదగిరిక్షేత్రాన్ని 70వేల మందికి పైగా భక్తులు దర్శించుకోగా, వివిధవిభాగాల ద్వారా రెండురోజుల్లో ఆలయ ఖజానాకు రూ.90,77,486ల ఆదాయం సమకూరిందని దేవస్థాన అధికారులు తెలిపారు.



యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రం పరిధిలో జాతీయ రహదారిపై మంచులో వాహనలైట్లతో ప్రయాణం



నల్లగొండ జిల్లా కట్టంగూరులో కురుస్తున్న మంచులో నుంచి వస్తున్న ఆటో

మంచు కురిసే వేళలో..

ఉమ్మడి జిల్లాను కమ్మేసిన మంచు

ఇబ్బందులు పడిన వాహనదారులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాను మంచుదుప్పటి కప్పేసింది. సంక్రాంతి, కనుమ (సోమ, మంగళవారం) రెండు రోజులపాటు వరుసగా మంచు కురిసింది. ఉదయం నాలుగు గంటల నుంచే మంచు కురవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహన లైట్లతో ప్రయాణించారు. చలికితోడు మంచు కురవడంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రాలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో ఉదయం 9 గంటల వరకు మంచు కురిసింది.

–స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ యాదాద్రి, కట్టంగూరు



యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని ఓ పంటపొలంలో మంచులో సాలీడు గూడు



భువనగిరి సమీపంలోని హైదరాబాద్-విజయవాడ రహదారిపై మంచుదుప్పటి

లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్‌స్టేషన్ల గుర్తింపు



యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరిలోని బాగాయత్ స్కూల్‌లోని పోలింగ్‌స్టేషన్

భువనగిరి రూరల్, జనవరి 16 : లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్‌స్టేషన్లను గుర్తించేందుకు అధికారులు ప్రక్రియ ప్రారంభించారు. శాసనసభ ఎన్నికలు నవంబరు 30న ముగియడంతో అధికారులు మరోమారు లోక్‌సభ ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఇందుకు పోలింగ్‌స్టేషన్ల పరిశీలన క్షేత్రస్థాయిలో చేపట్టి ఏమైనా మార్పులు చేర్పులు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే నూతన ఓటర్ల నమోదుతో పాటు మార్పులు చేర్పుల వంటి పనుల్లో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు.

ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో మొత్తం 3,533 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అందులో యాదాద్రి భువనగిరి జిల్లాలో 566, నల్లగొండలో 1,766, సూర్యాపేటలో 1,201 కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు క్షేత్రస్థాయిలో పోలింగ్ స్టేషన్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పాత భవనాలు, ఇరుకు గదులు, ఏమైనా ఉంటే వాటిని మార్చడంతో పాటు మరిన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వీటి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఈ నెల 20న జిల్లా అధికారులకు నివేదిక అందజేయనున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందించిన వివరాలను జిల్లా అధికారులు కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. అక్కడి నుంచి ఆమోదం లభిస్తే పోలింగ్ కేంద్రాల సంఖ్యను ఖరారు చేసే అవకాశం ఉంది.

శాసనసభ ఎన్నికల్లో పోలింగ్‌స్టేషన్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు
భువనగిరి	257
ఆలేరు	309
నల్లగొండ	284
సూర్యాపేట	271
తుంగతుర్తి	326
కోదాడ	296
హుజూర్‌నగర్	308
మిర్యాలగూడ	263
దేవరకొండ	208
మునుగోడు	307
నకిరేకల్	305
నాగార్జునసాగర్	399
మొత్తం	3,533

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



భువనగిరి రూరల్, జనవరి 16 : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. పచ్చర్లబోడు తండాకు చెందిన కునుసోతు లింగు(40) ఈ నెల 11వ తేదీన ఉదయం 9గంటలకు రోజుమాదిరిగానే కూలీ పనినిమిత్తం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి ఫోన్‌కు కాల్ చేసినా ఎత్తలేదు. 2, 3 రోజులు కుటుంబసభ్యులు మరోసారి ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు. 15వ తేదీ రాత్రి ఫోన్ చేయడంతో స్విచ్ ఆఫ్ వస్తుండడంతో అతడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు చుట్టుపక్కల బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో తల్లి జమిలి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. వివరాలకు 8712662472 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

జంతు సంక్షేమ పక్షోత్సవాలు 31 వరకు

భానుపురి, జనవరి 16 : జంతు సంక్షేమ పక్షోత్సవాలు ఈ నెల 14 నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతాయని సూర్యాపేట జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు, స్కూల్ విద్యార్థులకు జంతు సంక్షేమంపై అవగాహన కల్పిస్తామన్నారు. మూగజీవాలతో ప్రతిఒక్కరూ ప్రేమతో మెలిగాలన్నారు. నీటి వసతి, అవసరమైన ఆహారం అందించాలని, లేకుంటే అవి ఇతర జీవాలపై దాడి చేస్తాయన్నారు. జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. 17న జిల్లా వ్యాప్తంగా కుక్కలకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. గోశాలలో పనిచేసే సిబ్బందికి పశువుల సంరక్షణ గురించి అవగాహన కల్పిస్తామని, విద్యార్థులకు జంతు సంక్షేమంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి అవగాహన పెంచుతామన్నారు. పశువులను రవాణా చేసేటప్పుడు ఎలాంటి ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

క్రిస్టియన్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : వీరేశం


చిన్నపురిలో సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న వీరేశం

కట్టంగూరు, జనవరి 16: క్రిస్టియన్ల అభివృద్ధితో పాటు చర్చీలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. వండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామపరిధిలోని చిన్నపురి గ్రామంలో ఉన్న నిష్కలంక మాత దేవాలయం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నిర్వహించిన సిల్వర్‌జూబ్లీ ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను చర్చీ కమిటీ సభ్యులు, గ్రామస్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ రాగోరి, నాయకులు పొంక ప్రవీణ్, పొంక విలియం, కనుమూరి భాస్కర్, నాయకులు పోలిశెట్టి వెంకటేశ్వర్లు, సుంకరబోయిన నర్సింహ, పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్ పాల్గొన్నారు.

అయోధ్య రాముడు ఆదర్శనీయుడు


రామాలయంలో శివరామకృష్ణను సన్మానిస్తున్న భక్తులు

నాగార్జునసాగర్, జనవరి 16: అయోధ్య రాముడు అందరికీ ఆదర్శనీయుడని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శివరామకృష్ణ అన్నారు. సాగర్ పైలాన్ కాలనీలోని కోదండరామాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మాలతో ముడిపడి ఉందన్నారు. ఈ నెల 22వ తేదీన అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ప్రతీ గ్రామంలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వెంకటశివకుమార్, భక్తులు రమేష్‌జీ, బాలాజీ, రాములు, మల్లికార్జున్‌రావు, శ్రీనివాసరావు, సాయి, నరసింహారావు, నారాయణరెడ్డి, సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుని ఉత్సవాలకు వస్తా : కోమటిరెడ్డి


మంత్రి కోమటిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న నర్సింహాచార్యులు

నార్కట్‌పల్లి, జనవరి 16: మండలంలోని శాపల్లి గ్రామ కమలాద్రి కొండపై వేంచేసి ఉన్న లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలకు హాజరవుతానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ నెల 20 నుంచి ప్రారంభమై 30వ తేదీ వరకు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ ఆలయ అనువంశిక అర్చకుడు కారంపూడి నర్సింహాచార్యులు, రాకేశాచార్యులు కాంగ్రెస్ నాయకులతో కలిసి మంత్రి కోమటిరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్సవాల్లో ఏదో ఒకరోజు వేడుకకు హాజరవుతానని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సిద్దగోని స్వామిగౌడ్, నాయకులు సిలిగిరి వెంకట్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, నిమ్మనగోటి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : కిషన్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, జనవరి 16: జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డు హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఆలయ నిర్వాహకులు కలిసి ఫిబ్రవరి 11న ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం సహకారం అందిస్తుందని, అదేవిధంగా తనవంతు అభివృద్ధికి దోహదపడతానన్నారు. కార్యక్రమంలో బీమనపల్లి లక్ష్మణరావు, రాజయ్య, గుండెబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, యాదగిరి, ఇటికాల కేశవ్, వెంకన్న, బొడ్డుపల్లి సతీష్ పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలి

నల్లగొండటౌన్, జనవరి 16: రాష్ట్రంలో కులవృత్తులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం అమలుచేసిన ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ కులవృత్తులకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు గత ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసిందన్నారు. దీంతో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని యథావిధిగా కొనసాగించి మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


శ్రీనివాసులును సన్మానిస్తున్న గ్రామస్థులు

కొండమల్లేపల్లి, జనవరి 16: విద్యార్థులు, యువత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా న్యాయమూర్తిగా ఎంపికైన వస్కుల శ్రీనివాసులు అన్నారు. జిల్లా న్యాయమూర్తిగా ఎంపికైన తర్వాత సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామమైన కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొల్‌ముంతలపహాడ్‌కు వచ్చిన ఆయన్ను గ్రామస్థులు, యువకులు, ప్రజాప్రతినిధులు, విద్య నేర్పిన గురువులు సన్మానించారు. కార్యక్రమంలో మారం నారాయణరెడ్డి, వెంకటరమణ, సర్పంచ్ రవినాయక్, ఉపసర్పంచ్ పరుశురాం, ఎంపీటీసీ రాణిరాజునాయక్, లాలునాయక్, మాడ్గుల యాదగిరి, గ్యార యాదగిరి, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్


దామరచర్ల: బహుమతుల పంపిణీ చేస్తున్న నాయకులు


వట్టిమర్తిలో ముగ్గులు వేస్తున్న మహిళలు


కట్టంగూరులో రంగులద్దుతున్న మహిళలు

సంబురంగా సంక్రాంతి

- జిల్లాలో వైభవంగా వేడుకలు ● ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలు చోట్ల ముగ్గుల పోటీలు ● విజేతలకు బహుమతుల పంపిణీ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సంక్రాంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాల మధ్య, కన్నులపండువగా నిర్వహించుకున్నారు. సంక్రాంతి నోముల పూజలు, నట్టింట పాల పొంగుళ్ల, ఇంటి ముంగిట రంగవల్లులు... గంగిరెద్దుల ప్రదర్శన, ఆట పాటలతో సందడి చేశారు. యువకులు, చిన్నారులు గాలి పటాలు ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. చిన్నారులకు భోగి పండ్లను పోశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. సంక్రాంతి నేపథ్యంలో ఇళ్లన్నీ బంధుమిత్రులతో కళకళలాడాయి. హరిదాసులు ఇంటింటికి తిరిగారు. గంగిరెద్దుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఇళ్లముందు సంక్రాంతి, కనుమ పండగలను పురస్కరించుకొని అందమైన ముగ్గులు వేసి బొబ్బెమ్మలను పేర్చారు. పిండి వంటలు చేసుకొని ఆనందోత్సవాలతో గడిపారు. పిల్లలు, యువకులు పతంగులు ఎగురవేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని పలు ముగ్గులు, క్రీడా పోటీలు నిర్వహించారు.

● చింతపల్లి మండలంలోని హోమంతాలపల్లి గ్రామంలో లక్ష్మీ పెరుమాళ్ల దేవాలయం వద్ద ఎడ్ల బండ్ల ర్యాలీలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దేవాలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీ షిర్డీసాయిబాబా, రాజరాజేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● కట్టంగూరు మండల కేంద్రంలో శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులతో పాటు ఐదుగురు మహిళలకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సంస్థ సభ్యులు మూడుదుడ్ల ఆంజనేయులు, కళావతి, సాయినాథ్, సంతోష్, నర్సింహ, మహేష్ పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలంలోని ఖుదాబక్ష్‌పల్లి గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీఎస్ఆర్ యువసేన అధ్యక్షుడు, సర్పంచ్, ఉపసర్పంచ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి మండలంలోని బాలాజీతండా, జిలకరకుంటతండా, హేముతండాల్లో మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ పాల్గొని మాట్లాడుతూ ముగ్గుల పోటీలు ఐక్యతను చాటుతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల చినరామయ్య, సర్పంచ్ పకీరానాయక్, ఎంపీటీసీ కాంతి కృష్ణకాంత్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీను, విజయ, కొర్ర అశోక్‌నాయక్, దశరథ్, మోతీలాల్, బాలునాయక్, చాంప్లనాయక్, యాంకయ్య, బాబు, విజయ్, రవీందర్, సర్దార్, సైదా, సేవ పాల్గొన్నారు.

● త్రిపురారం మండలంలోని కంపసాగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొండా భాస్కర్ ఆధ్వర్యంలో రంగుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్ఐ వీరశేఖర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అవిరెండ్ల మట్టయ్య, బొల్లం సైదులు, రంగారెడ్డి, నాగరాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగళి రామకృష్ణగౌడ్ సహకారంతో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు పారితోషికంతో పాటు చీరెలు, జ్ఞాపికలను అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ చీరలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా ప్రతినిధి కోడే సతీష్, జడ్పీటీసీ ఎర్ర రణీల, అశోక్, శంభులింగారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● దామరచర్ల మండల కేంద్రంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. దామరచర్ల ఎంపీటీసీ-2 సోము సైదిరెడ్డి తన కుమార్తె తేజస్వినిరెడ్డి జ్ఞాపకార్థంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఆంగోతుల లలితహతీరాంనాయక్, నాయకులు కుందూరు వీరకోటిరెడ్డి, పడిగపాటి కోటిరెడ్డి, బాల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


చింతపల్లి: హోమంతాలపల్లి గ్రామంలో పెరుమాళ్ల దేవాలయానికి చేరుకున్న భక్తులు


కొండమల్లేపల్లి : ముగ్గులు వేస్తున్న చిన్నారులు


నార్కట్‌పల్లిలో గంగిరెద్దు ప్రదర్శన


త్రిపురారం: బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ వీరశేఖర్, భాస్కర్


మర్రిగూడలో జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


సిబ్బందితో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ, జనవరి 16: పరిశుభ్రతలో పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం 5 గంటలకు మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి పారిశుధ్య కార్మికులు, జవాన్లతో సమావేశం ఏర్పాటు చేసి పారిశుధ్య పనులపై సమీక్షించారు. వార్డుల్లో రోడ్లపై చెత్త, డ్రైనేజీల పూడికతీత పనులు నిత్యం కొనసాగించాలని సూచించారు. పనిచేసే వాళ్ల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలు ప్రతీ వాడకు రోజూ వెళ్లాలని ఆదేశించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలతో కలిసి సిబ్బంది పని చేయాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించేలా మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీ పరిసరాల్లో బ్లీచింగ్ చల్లించి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

లక్పతి సేవలు ఆదర్శనీయం - ఎమ్మెల్యే

మిర్యాలగూడ టౌన్: లక్పతినాయక్ అందించిన విద్యా సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకుడు పానుగోతు లక్పతినాయక్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీసీసీ ప్రెసిడెంట్ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి బహుమతులు అందజేశారు. పానుగోతు లక్పతినాయక్ ట్రస్ట్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలాజీనాయక్, ఛత్రునాయక్ మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ పానుగోతు గోపినాథ్, బక్కా శ్రీనివాసాచారి, రాంచంద్రనాయక్, ధర్మానాయక్, చాపల శ్రీను, వెంకన్న, లక్ష్మణ్, స్కైలాబ్‌నాయక్, పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, గోపనబోయిన నాగమణి, ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్

- పది రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మర్రిగూడ మండలం చర్చీకాలనీ ఇక్కట్లు

మర్రిగూడ, జనవరి 16: మిషన్ భగీరథ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పది రోజుల నుంచి నీటి సరఫరా బంద్ కావడంతో చర్చీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని రాజుపేటతండా గ్రామపంచాయతీ పరిధిలోని చర్చీకాలనీలో పది రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడం వల్ల బోరునీటిని తాగుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి రోజు కూడా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో నీటిని కొనుక్కుని తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. పలుసార్లు సర్పంచ్, మిషన్ భగీరథ అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేడని పేర్కొన్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటి సరఫరా చర్చీకాలనీకి అందేవిధంగా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై సర్పంచ్ సక్కుబాయిబిచ్చునాయక్‌ను వివరణ కోరగా చర్చీ కాలనీకి నీటి సరఫరా లేదని తనకు సమాచారం ఇవ్వలేదని, నీటి సరఫరా చేసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

28న మహిళా శక్తి సమ్మేళనం

నల్లగొండ కల్చరల్: పట్టణంలో ఈ నెల 28వ తేదీన మహిళా శక్తి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రాంత ప్రభారి వరలక్ష్మి, డాక్టర్ స్వప్న, వినీలారెడ్డి, నన్నూరి లత తెలిపారు. జిల్లా కేంద్రంలోని మాధవ స్మారక నిలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో శక్తి సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు దేవిక, వసంత, అరుణ, జ్యోతి, విజయ, అనురాధ, పావని, పుష్పలత పాల్గొన్నారు.

ఘనంగా గోదా రంగనాథస్వామి కల్యాణం


నల్లగొండ: కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నల్లగొండకల్చరల్, మిర్యాలగూడరూరల్, జనవరి 16: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదా రంగనాథ స్వామి కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. జిల్లాలోని నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో గల శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, మిర్యాలగూడ మండలం అవంతీపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మంగళ వాయిద్యాలు మోగుతుండగా భక్తుల గోవింద నామస్మరణతో అర్చక స్వాములు అమ్మవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందే ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వీటీకాలనీలో ఎన్‌సీ పద్మ అమ్మవారి పాశురాన్ని ప్రవచనం చేశారు. అర్చక స్వాములు కల్యాణ తంతును నడిపించారు. ఆలయ అర్చకులు పవన్‌శర్మ, సాయిశర్మల ఆధ్వర్యంలో సాగిన కళ్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రావిరాల పూజిత వెంకటేశ్వర్లు, కాలనీ అధ్యక్షుడు నూకల జైపాల్‌రెడ్డి, కాలనీవాసులు మేడం ప్రభాకర్, లింగారెడ్డి, జనార్ధనాచారి, నాగరాజు, కృష్ణయ్య, ప్రభాకర్, అంజమ్మ, సుమలత పాల్గొన్నారు.


కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

● అవంతీపురంలో అర్చకులు రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ శరత్‌బాబు, వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ, రాంప్రసాద్, రవి, శంకర్, ఏడుకొండలు, కృష్ణ, నాగయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏలను ప్రకటించాలి

నల్లగొండ, జనవరి 16: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరపతి సత్యనారాయణ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, బదిలీ అయి, రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, 317 జీవో బాధిత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ నెల 17వ తేదీన కరీంనగర్‌లో జరిగే సమావేశంలో పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సంక్షిప్త సమాచారం...

శాలిగౌరారం: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలుచేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు కిరణ్ డిమాండ్ చేశారు. మండలపరిధిలోని రోడ్లను మరమ్మతు చేయించాలని, మండల స్థాయిలో అంబేడ్కర్ భవనం నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూంల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, ఎన్నికల హామీలను నెరవేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట నాయకులు కొంగరి బాల్‌రాజ్, ఎర్ర రాంబాబు, లక్ష్మణ్ ఉన్నారు.

చిట్యాల: దివ్యాంగులు ఉచిత బస్‌పాస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి కోరారు. మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన బస్‌పాస్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు: జిల్లావ్యాప్తంగా నిర్వహించిన రేషన్‌డీలర్ల పరీక్ష పారదర్శకంగా లేదని, పరీక్ష ఫలితాల్లో ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థులకు నిరాశ కలిగిందని కట్టంగూరు మండలానికి చెందిన నిరుద్యోగుల జేఏసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు, ఆర్డీవోకు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. పరీక్ష నిర్వహణ సక్రమంగా లేదని ఆ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు గుడుకుంట్ల రామకృష్ణ, పొట్టబత్తుల సైదులు, గద్దపాటి రవి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

చిట్యాల: కాలనీలలోని మురుగునీటిని తొలగించి ప్రజలను అంటువ్యాధుల నుంచి రక్షించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య కోరారు. పట్టణంలోని భువనగిరిరోడ్డులో నిలిచి ఉన్న మురుగునీరును వారు పరిశీలించి మాట్లాడారు. మునిసిపాలిటీ పాలకవర్గం, సిబ్బంది వెంటనే స్పందించి మురుగునీరు తొలగించాలని కోరారు. లేనిచో మునిసిపాలిటీ ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐతరాజు యాదయ్య, జిట్ట రమేష్, వెంకటేష్, మారయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తిరందాసు విష్ణు డిమాండ్ చేశారు. శేర్‌లింగంపల్లి ఆల్విన్ కాలనీలో జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం క్షమించరాని నేరమన్నారు. విశ్వకర్మ సంఘం నాయకులు జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి యునైటెడ్ క్రిస్టియన్ సర్వీస్ సొసైటీ మండల నూతన కమిటీని స్టేట్ కన్వీనర్ కోనే ప్రభుప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎ.ఎలీషా, ఉపాధ్యక్షుడు ఆర్.జకరయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వంశీరాజ్, సహాయ కార్యదర్శిగా మత్తయ్య సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దేవకుమార్, రాజారావు, దయాతి, రత్న, సునిలుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో గల షిలోహు మినిస్ట్రీస్ చర్చీ ఆవరణలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో షిలోహు మినిస్ట్రీస్ చర్చి నిర్వాహకులు ఏకుల సామేల్, ఏకుల సురేష్, యాదగిరి పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలం వెలిమినేడులో ఓన్లీ మాస్ నో క్లాస్ అనే వాట్సాప్ గ్రూప్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గ్రూప్ సభ్యులు, గ్రామానికి చెందిన యువకులు, విద్యావంతులు, మేధావులు పాల్గొని ఉత్సాహంతో క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో ఆంజనేయులు, పబ్బు దేవేందర్‌గౌడ్, లింగస్వామి, శ్రీశైలం, నర్సింహ పాల్గొన్నారు.

రామగిరి: నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌లో గల టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 18, 19వ తేదీల్లో జిల్లా స్థాయి తపాలా బిళ్లల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ రఘునాథస్వామి తెలిపారు. కలెక్టర్ హరిచందన ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

కనగల్: మండలంలోని రేగట్టే గ్రామంలో అయోధ్య రాముడి అంక్షితలను, రామమందిర కరపత్రాలను గ్రామ ఆలయకమిటీ, యువజన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారింగ్ సతీష్, తిరందాసు సంతోష్‌కుమార్, శంకర్ పాల్గొన్నారు.

టెన్నిస్ నేషనల్స్ (బ్లైండ్)లో ద్వితీయస్థానం


ప్రైజ్ అందుకుంటున్న షేక్ ఉమర్ అహ్మద్

మిర్యాలగూడటౌన్, జనవరి 16: పట్టణానికి చెందిన షేక్ ఉమర్ అహ్మద్ టెన్నిస్ నేషనల్స్ (బ్లైండ్)లో సత్తా చాటాడు. ఇటీవల గోవాలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో అత్యద్భుత ప్రతిభ చాటి ద్వితీయ స్థానంలో నిలిచాడు. హ్యాపీ ఉమెన్ ఫర్ ద బ్లైండ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు దేశ నలుమూలల అంధ క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం తరపున ఇద్దరు క్రీడాకారులు పాల్గొనగా సింగిల్స్ ఆడిన ఉమర్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. పట్టణ సమీపంలోని ఉట్లపల్లిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఉమర్‌ను క్రీడాభిమానులు, సహోపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


కాకునూరి ధనుష్

మిర్యాలగూడ టౌన్, జనవరి 16: పట్టణానికి చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు కాకునూరి ధనుష్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శ్రీచైతన్య పాఠశాలలో 8వ తరగతి విద్యనభ్యసిస్తున్న ధనుష్ ఇటీవల ఇండోర్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. ఈ నెల 17 నుంచి జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరగనున్న నేషనల్స్ (అండర్-14)లో పాల్గొననున్నట్లు తల్లిదండ్రులు కృష్ణ, లావణ్య తెలిపారు.